

టోల్‌గేట్‌పై రగడ

ముదురుతున్న వివాదం

అగనంపూడి వద్ద టోల్ బూత్‌లు ధ్వంసం

- పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్
- టోల్‌గేట్ నిర్వహణను గడిచిన కొన్నేళ్లుగా వ్యతిరేకిస్తున్న స్థానికులు
- గతంలో హైకోర్టుకు వెళ్లిన గాజువాక బార్ అసోసియేషన్
- న్యాయస్థానంలో తీర్పు సానుకూలంగా రావడంతో టోల్‌గేటు మూసివేత
- కొన్నాళ్లకే మళ్లీ పునరుద్ధరణ
- సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకేనంటున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
- రూ.1200 కోట్లతో నగరంలో 12 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్టు వెల్లడి
- టోల్‌గేట్ తొలగిస్తే ఆ పనులకు బ్రేక్ పడుతుందని వాదన


అగనంపూడి వద్ద టోల్‌గేట్ బూత్‌లను తొలగించిన దృశ్యం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):

అగనంపూడి టోల్‌గేట్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. స్థానికులు, కూటమి కార్యకర్తలు టోల్‌గేట్ లేకుండా చేయాలని చూస్తుండగా, కొనసాగించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు యత్నిస్తున్నారు. రెండు రోజుల కిందట స్థానికులు టోల్‌గేట్ వద్ద ఆందోళన నిర్వహించడంతో పాటు స్టాపర్లను తొలగించి, ఫీజు వసూలు చేయకుండా సిబ్బందిని అడ్డుకున్నారు. బుధవారం రాత్రి కొందరు జేసీబీలు, ఇతర యంత్రాలను వినియోగించి టోల్‌గేట్ వద్ద బూత్‌లను తొలగించేశారు. అక్కడ టోల్‌గేట్ ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. బూత్‌ల ధ్వంసం చేయడంతోపాటు టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించడంపై పోలీసు అధికారులకు గురువారం ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్ ఫిర్యాదు చేశారు. అదే సమయంలో నేషనల్ హైవే అథారిటీ చైర్మన్‌కు కూడా సమాచారం తెలియజేశారు.

వివాదం ఏమిటి..?

అగనంపూడి వద్ద 1997లో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో టోల్‌గేట్‌ను ఏర్పాటుచేశారు. అయితే, గడిచిన కొన్నాళ్లుగా ఈ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో టోల్‌గేట్ ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. ఈ టోల్‌గేట్ వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికంగా భారం మోయాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా గతంలో పోరాటం చేశారు. 2019లో గాజువాక బార్ అసోసియేషన్ టోల్‌గేట్‌ను తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. బార్ అసోసియేషన్ వాదనలను విన్న హైకోర్టు టోల్‌గేటు తొలగింపునకు ఆదేశాలు ఇచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. కొద్దినెలలపాటు టోల్‌గేటును మూసివేశారు. అయితే,

... మిగతా 6వ పేజీలో

ఫిల్మ్ క్లబ్బు... వైసీపీ గబ్బు

సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో గతంలో వైజాగ్ ఫిల్మ్‌నగర్ క్లబ్ ఏర్పాటు

వైసీపీ అధికారంలోకి వచ్చాక స్వాధీనం

శాశ్వత కమిటీ ఏర్పాటు

- సభ్యులుగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఏసీఏ సెక్రటరీ గోపీనాథరెడ్డి, మేరీటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి నియామకం
- మేనేజ్‌మెంట్ కమిటీ అంటూ మరొకటి నియామకం
- ఏకపక్షంగా ఎన్నికలు
- అడ్డగోలుగా వ్యవహారాలు
- అక్కడ కూడా వైఎస్‌ఆర్ లాన్ అంటూ పార్టీ పేర్లు

ఫిల్మ్‌క్లబ్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులో తిమ్మాపురం వద్ద నిర్వహిస్తున్న వైజాగ్ ఫిల్మ్‌నగర్ క్లబ్‌లో అడ్డగోలు వ్యవహారాలు నడుస్తున్నాయి. ఈ క్లబ్‌ను పూర్తిగా సినీ పరిశ్రమకు చెందిన వారి కోసం గతంలో కేఎస్ రామారావు, తదితరుల బృందం ఏర్పాటుచేసింది.

ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు క్లబ్‌పై కన్నేశారు. అడ్డగోలుగా హస్తగతం చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వానికి సలహాదారులుగా వ్యవహరించిన సాగి దుర్గాప్రసాదరాజు, లంకా శ్రీధర్‌ల బృందం సొసైటీల నిబంధనలకు విరుద్ధంగా 'శాశ్వత కమిటీ' పేరుతో ఒక టీమ్‌ను పెట్టి వైసీపీకి చెందిన 11 మందిని అందులో నియమించారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ గోపీనాథరెడ్డి, మొన్నటి వరకు ఏపీ మేరీటైమ్ బోర్డ్ చైర్మన్‌గా వ్యవహరించిన కాయల వెంకటరెడ్డి, తదితరులను అందులో సభ్యులుగా నియమించారు. సొసైటీ బైలాను కూడా మార్పు చేసి, వారి తరువాత కుటుంబ సభ్యులు వారసులుగా శాశ్వత కమిటీలో ఉంటారని ప్రచారం చేసుకున్నారు.

వాస్తవానికి సొసైటీలు/క్లబ్బులకు శాశ్వత కమిటీలు వేయకూడదు. న్యాయసూత్రాలకు విరుద్ధం. ఏడాదికో, రెండేళ్లకో ఎన్నికలు పెట్టుకొని కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఫిల్మ్ క్లబ్‌ను ఈ బృందం హస్తగతం చేసుకున్నాక మేనేజ్‌మెంట్ కమిటీ అంటూ వేరొకటి పెట్టి అందులో పాత కార్యవర్గంలో కేఎస్ రామారావు లాంటి ఇద్దరు, ముగ్గురికి స్థానం కల్పించి, మిగిలిన పోస్టులన్నీ వారే తీసుకున్నారు. నాలుగు నెలల క్రితం ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించి, దానికి కాయల వెంకటరెడ్డిని అధ్యక్షునిగా ప్రకటించారు.

ఆర్థిక లోటుపాట్లు

హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ రాజు అనే వ్యక్తి సభ్యత్వ రుసుమే కట్టలేదని ఆరోపణలు ఉన్నాయి. ఆయన్ను ఇక్కడ పెట్టి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. కేఎస్ రామారావు హయాంలో క్లబ్ నిర్వహిస్తున్న స్థలానికి నెలకు రూ.4 లక్షలు అద్దె ఇచ్చేవారు. వీరు బాధ్యతలు చేపట్టాక యజమానితో కుమ్మక్కై అద్దెను ఏకంగా 50 శాతం పెంచేసి రూ.6 లక్షలు చొప్పున ఏడాదికి రూ.72

... మిగతా 6వ పేజీలో

సింహాచలం దేవస్థానంలో అడ్డగోలు నియామకాలు


- అవుట్‌సోర్సింగ్‌లో ఎనిమిది మందికి ఉద్యోగాలు
- రూ.24 లక్షలు కలెక్షన్?
- అధికారులను పిలిచి మందలించిన ఎమ్మెల్యే గంటా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానంలో పలువురు అధికారులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే రీతిన వ్యవహరిస్తున్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో దేవస్థానాల ఈఓలను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సింహాచలం కూడా ప్రధాన దేవస్థానం కావడంతో ఇక్కడ ఎవరిని నియమించాలా?...అని యోచిస్తున్నారు. ఈలోగా ఇక్కడ కొందరు జేబులు నింపుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దేవస్థానంలో గత రెండేళ్లుగా ఉచిత సేవలు అందిస్తున్న పూజారుల్లో 'దక్షిణ' సమర్పించుకున్న ఆరుగురిని అవుట్‌సోర్సింగ్‌లో చేర్పించి, జీతాలు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. అలాగే మరో ఇద్దరికి కూడా ఉద్యోగ అవకాశం కల్పించారు. వీరందరి నుంచి రూ.24 లక్షలు వసూలు చేశారంటున్నారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసలు ఏమి జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. అంతా నిజమేనని నిర్ధారించుకొని దేవస్థానం ఈఓ, ఏఈఓలు, ఇతర అధికారులు అందరినీ గురువారం ఇంటికి పిలిపించారు. దేవస్థానం అభివృద్ధి పనులపై ఆరా తీసి, ఆ తరువాత ఈ అడ్డగోలు నియామకాల గురించి ప్రశ్నించారు. అధికారులు నీళ్లు నమలడంతో తక్షణమే తీసుకున్న వారిని నిలిపివేయాలని ఆదేశించారు. ఎవరికైనా అర్హతలు ఆధారంగానే ప్రయోజనం కల్పించాలని, ఇలా డబ్బులు తీసుకొని చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అధికారులను మందలించారు. అదే సమయంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఫోన్ చేసి, సింహాచలం దేవస్థానంలో కొత్తగా నియమించిన వారిని పరిగణలోకి తీసుకోవద్దని సూచించారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ అశోక్

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్న కోలా గురువులు ఇరవై రోజుల క్రితం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఏడుగురు సభ్యులతో కూడిన నాన్ అఫీషియల్ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి కమిటీ రద్దయ్యింది. దాంతో డీసీసీబీలో పాలనాపరమైన ఇబ్బందులు వచ్చాయి. దాదాపు ఇదే సమస్య మిగిలిన జిల్లాల్లో తలెత్తడంతో డీసీసీబీ బాధ్యతలు జేసీలకు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మహా నిర్లక్ష్యం

అభివృద్ధి పనులపై కొరవడిన జీవీఎంసీ పర్యవేక్షణ

- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది, థర్డ్ పార్టీ ఏజెన్సీ ప్రతినిధులు
- నాణ్యత లేకపోయినా ప్రమాణాల ప్రకారమే పనులు చేసినట్టు ధ్రువీకరణ
- అధికారులకు అంతా తెలిసినా ఉదాసీనత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


ముస్లింతాటిచెట్లపాలెం వద్ద కూలిన ప్రహరీగోడ

ముస్లిం తాటిచెట్లపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ రక్షణకు నిర్మించిన ప్రహరీ గోడ బుధవారం ఉదయం సర్వీస్ రోడ్డులోకి కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నాలుగు నెలల కిందట శివాజీ పార్కు ప్రాంతంలో తారురోడ్డు వేశారు. రోడ్డు వేసిన తర్వాత రోలింగ్ సరిగా చేయకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులుపడ్డారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు మేరకు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా జీవీఎంసీ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

జీవీఎంసీ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తోంది. పనులను ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను థర్డ్ పార్టీ పేరుతో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే, అవి కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. ఇదే అదనుగా కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. జాతీయ రహదారిపై ముస్లింతాటిచెట్లపాలెం వద్ద గ్రీన్‌బెల్ట్‌లో రూ.18 లక్షలతో ఫ్లవర్ పార్కు ఏర్పాటుచేస్తున్నారు. అందులో భాగంగా గ్రీన్‌బెల్ట్‌కు వెనుక వైపు సర్వీసురోడ్డుని ఆనుకుని సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో ప్రహరీ గోడ నిర్మించారు. గోడ నిర్మాణంలో ఉండగానే చిన్నపాటి వర్షం కురవడంతో బుధవారం సర్వీసురోడ్డులోకి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ఉదంతం జీవీఎంసీ చేపడుతున్న పనుల్లో నాణ్యతపై మరోసారి చర్చకు తావిచ్చినట్టయ్యింది.

జీవీఎంసీ పరిధిలో ఏటా దాదాపు రూ.500 కోట్లు విలువైన పనులు జరుగుతుంటాయి. వీటిలో తారు రోడ్లు, సీసీ రోడ్లు, కాలువలు, డ్రైనేజీల నిర్మాణం, పైప్‌లైన్ల నిర్మాణం, పార్కులు, గ్రీనరీ, సుందరీకరణ వంటి పనులు ఉంటాయి. ఆయా పనులను చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ, సిటీ పోలీస్ కమిషనర్ల బదిలీ?

నేడో, రేపో ఉత్తర్వులు జారీ అవుతాయని ప్రచారం

- ఇరువురూ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని పలు సందర్భాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఆరోపణ

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):


సీపీ రవిశంకర్ అయ్యనార్


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మతోపాటు నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ బదిలీపై వెళ్లిపోనున్నారనే ప్రచారం పెద్దఎత్తున జరుగుతోంది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ గత ఏడాది ఏప్రిల్ 13న బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగరంలో రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, కూడళ్ల అభివృద్ధి, గెడ్డల ఆధునికీకరణపై ప్రధానంగా దృష్టిసారించారు. అదేసమయంలో అస్మదీయులుగా భావించే అధికారులు, కాంట్రాక్టర్ల పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాను చేయాలనుకుంటే నిబంధనలను పక్కనపెట్టి మరీ ఆయా పనులను పూర్తిచేసేస్తారని జీవీఎంసీ అధికారులు చెబుతుంటారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల ఆదేశాలను శిరసావహించే వారని ఆరోపణలు ఉన్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జీవీఎంసీకి సంబంధం లేని కార్యక్రమం అయినప్పటికీ యూసీడీ అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ జనాలను ఆయన కార్యక్రమాలకు తరలించేవారని టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తుండేవారు. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ సాయికాంత్‌వర్మ పట్టించుకోకుండా తన స్వామిభక్తిని ప్రదర్శించేవారనే అభిప్రాయం ఉంది. ఆయన్ను కీలకమైన జీవీఎంసీ కమిషనర్ పోస్టులో ఉంచకూడదని కూటమి నేతలు రాష్ట్ర ప్రభుత్వంలో

... మిగతా 6వ పేజీలో




చల్లబడిన నగరం

నగరంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒక మోస్తరు వర్షం కురిసింది. కలెక్టరేట్ ప్రాంతంలో వర్షానికి డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్లపైకి రావడంతో వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

- విశాఖపట్నం

పీజీ సెట్‌లో సత్తా చాటారు

టాప్-10లో నిలిచిన జిల్లా విద్యార్థులు


అజయ్‌కుమార్ సైదాన, 1వ ర్యాంక్, బీఎఫ్ఏ


కిల్లో చాందిని, 2వ ర్యాంకు, జియాలజీ

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీ సెట్ ఫలితాలను ఏయూ అధికారులు గురువారం విడుదల చేశారు. ఏయూ పరిధిలో ఈ ప్రవేశ పరీక్షకు 21,606 మంది హాజరు కాగా 13,108 మంది (60.67 శాతం) అర్హత సాధించారు. జిల్లాకు చెందిన 30 మందికిపైగా రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారు. సబ్జెక్టుల వారీగా మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌లో నగర పరిధిలోని గొల్లల కంచరపాలెం ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ ప్రథమ ర్యాంకు సాధించగా, బోటనీలో లక్ష్మీనరసింహ థియేటర్ ప్రాంతానికి చెందిన గొలగని చక్రిక యాదవ్ ఆరో ర్యాంకు, రెడ్డి కంచరపాలెం ప్రాంతానికి చెందిన ముక్కేటి మృదుల పదో ర్యాంకు సాధించారు. కామర్స్‌లో సుజాతనగర్ ప్రాంతానికి చెందిన ఎం.పార్వతి గాయత్రి నాలుగో ర్యాంకు, కంప్యూటర్ సైన్స్‌లో మారికవలస ప్రాంతానికి చెందిన నంబళ్ల వైష్ణవి మూడో ర్యాంకు, భీమిలి ప్రాంతానికి చెందిన సూరపాటి ధనరాజు ఐదో ర్యాంకు, ఎకనామిక్స్‌లో గాజువాక ప్రాంతానికి చెందిన పంచాది సాయి మణికంఠ ఏడో ర్యాంకు, ఎడ్యుకేషన్‌లో పెందుర్తి ప్రాంతానికి చెందిన

... మిగతా 6వ పేజీలో

ఎడ్‌సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ

- వార్త I పేజీలో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 27: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్, వుడా కాంప్లెక్స్ ఏరియా, టీపీటీ కాలనీ, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వెనుక, రసపూర్ణ వెనుక, సీతమ్మధార ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోర్టు అథారిటీ బోర్డు సభ్యుడిగా పోతన్న


యు.పోతన్న

అక్కయ్యపాలెం, జూన్ 27 : విశాఖపట్నం హార్బర్, పోర్టు వర్కర్స్ ఏఐటీయూసీ నాయకుడు యు.పోతన్న విశాఖ పోర్టు అథారిటీ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కవచం ఏర్పాటు


గ్రీన్‌బెల్ట్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్

కంచరపాలెం, జూన్ 27: కంచరపాలెం నుంచి బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ చుట్టూ జీవీఎంసీ అధికారులు రక్షణకవచాన్ని ఏర్పాటు చేస్తుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రీన్‌బెల్ట్‌కు సరైన రక్షణ లేకపోవడంతో చీకటి పడగానే మందుబాబులు ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు. ప్రస్తుతం తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు గల బెల్ట్‌కు ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేసి లోపలకు ఎవరు ప్రవేశించలేని రీతిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో గ్రీన్‌బెల్ట్ పరిసరాలు సుందరంగా మారాయి. ఈ నేపథ్యంలో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి పండగ

మాధవధార, జూన్ 27: జీవీఎంసీ 51వవార్డు సీతన్న గార్డెన్స్‌లో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉదయం నుంచి వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటరు రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విశేష అలంకరణలో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

లలితాపీఠంలో కవితా గోష్ఠి


అనుగ్రహభాషణం చేస్తున్న సిద్ధేశ్వరానంద

అక్కయ్యపాలెం, జూన్ 27: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితాపీఠంలో గురువారం ఆధ్యాత్మిక కవితా గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద ఆవిష్కరించారు. సభకు ఆచార్య కొలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. డాక్టర్ డీవీ సూర్యారావు కవితా గోష్ఠిని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సభలో పాల్గొన్న 24 మంది కవులను స్వామి సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.


పూర్ణామార్కెట్ వద్ద కాలువలోంచి రోడ్డుపైకి పొంగుతున్న మురుగు


మురుగు నీటితో నిండిపోయిన పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి

రహదారిపైకి భారీగా మురుగు నీరు

- పూర్ణామార్కెట్ పరిధిలో అస్తవ్యస్తంగా రహదారుల విస్తరణ
- కాలువల్లోంచి రోడ్లపైకి మురుగు
- నదులను తలపిస్తున్న రోడ్లు
- అధికారుల తీరుపై స్థానికుల విమర్శలు

పూర్ణామార్కెట్, జూన్ 27: పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డ విస్తరణ, కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు విస్తరణలో జీవీఎంసీ జోనల్, టౌన్ ప్లానింగ్ అధికారుల అనాలోచిత విధానాలతో కాలువల్లోంచి ప్రవహించాల్సిన మురుగునీరు రహదారులపైకి చేరుతోంది. ఫలితంగా పాదచారులు అవస్థలు పడాల్సి వస్తోంది. పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు బస్టాప్ వైపు పాత కాలువలపైనే పలకలు వేసి కలరింగ్ ఇచ్చారని, ఓ మోస్తరు వర్షం కురిసేసరికి మురుగు రోడ్డుపైకి ప్రవహించిదని వాపోతున్నారు. నగరంలో గురువారం వర్షం కురిసింది. దీంతో కాలువలు పొంగి పొర్లాయి. రహదారులు విస్తరణ చేపట్టే సమయంలో కాలువలను పటిష్ఠం చేయడం, కొత్తగా కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్ణామార్కెట్ మెయి న్ గేట్ వద్ద వైపు వర్షం నీరు కాలువల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డు మీదకు చేరింది. ఫలితంగా రహదారి చెరువును తలపించింది. బస్టాప్ వైపు కాలువలు నిర్మించకుండా పాత కాలువలపైనే టైల్స్ అతికించారని స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు ఇరువైపులా కొత్తగా కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని, అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక కొండ ఘాట్‌రోడ్డు వద్ద ...


ఘాట్‌రోడ్డు ప్రారంభంలో నిలిచిన నీరు

జగదాంబ కూడలి, జూన్ 27: సత్యనారాయణ స్వామి (ఇసుకకొండ) ఘాట్ రోడ్డు పూర్ణామార్కెట్ వైపు ప్రధాన మార్గం పరిస్థితి అదే రీతిలో ఉంది. ఇక్కడ రోడ్డు ఇరుగ్గా నిర్మించడంపై భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఘాట్ రోడ్డు మార్గం పైకి వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మార్గం పక్కన వక్ఫ్ బోర్డుకు చెందిన దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించి రోడ్డు నిర్మించేందుకు వీలున్నప్పటికీ జీవీఎంసీ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో చినుకు పడితే నీరంతా రోడ్డుపైనే నిలిచిపోయి కాలువను తలపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. కొండ మార్గం కాలువ నిర్మాణాలు సక్రమంగా జరగగపోవంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోందని, ఈ విషయం ఇంజనీరింగ్ అధికారులు గుర్తించాలని భక్తులు కోరుతున్నారు.

'శానిటరీ సిబ్బంది సేవలు నిరుపమానం'


ఆదినారాయణ దంపతులను సత్కరిస్తున్న గంకల అప్పారావు,సిబ్బంది

కంచరపాలెం, జూన్ 27: వార్డు అభివృద్ధిలో శానిటరీ సిబ్బంది సేవలు నిరుపమానమని జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన శానిటరీ సిబ్బంది ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన నాలుగు దశాబ్దాలు సేవలందించిన లింగాల ఆదినారాయణ దంపతులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వార్డు పరిశుభ్రతే ధ్యేయంగా పనిచేస్తున్న సిబ్బంది సేవలు కొనియాడారు. ప్రజారోగ్యంలో శానిటరీ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం ప్రతినిధి గోవింద్


ఎమ్మెల్యే వంశీకృష్ణతో గోవింద్, తదితరులు

పూర్ణామార్కెట్, జూన్ 27: నియోజవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణను పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి, నందమూరి అభిమానుల సంఘం ప్రతినిధి గంగాడ గోవింద్ కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేను కలిసి మంచి మెజారిటీతో విజయం సాధించినందుకు అభినందించారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో ప్రధాన సమస్యలు, ఘాట్ రోడ్డు నిర్మాణం, ముఖద్వారం నిర్మాణంలో లోపాలపై వివరించారు. నందమూరి అభిమానులు, వర్తకులు పాల్గొన్నారు.

ప్రోగ్రాం అధికారులతో డీఎంహెచ్‌వో సమావేశం


వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూన్ 27: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కేంద్రం బృందం సభ్యులు జితేంద్రసింగ్, ఎస్.పూజ, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావులు సంబంధిత ప్రోగ్రాం అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎనీమియా ముక్త భారత్ జిల్లాలో అమలుపై చర్చించిన అనంతరం హెల్త్ అవేర్‌నెస్ కేంద్రాలను, పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.సమతతో కలిసి మధురవాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలల్లో కార్యక్రమ అమలుతీరును తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే ఐరన్ సిరప్స్, మాత్రల వివరాలు, గర్భిణులు బాలింతల సంపూర్ణ పోషణ కార్యక్రమంలో వినియోగించే మాత్రలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జీవవనరాణి, బి.నాగేశ్వరరావు, ఉమాపతి, ప్రశాంతి, హీన దీక్షిత్, ఐ.మనోరమ, శాంతిప్రియ, నాగభూషణం పాల్గొన్నారు.

ఆరిలోవలో....

దుర్గా బజార్, ఆరిలోవలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను గురువారం జిల్లా వైద్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు సందర్శించి ఆరోగ్య సిబ్బందిని, ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

ఉత్పత్తుల నాణ్యతపై వినియోగదారులకు అవగాహన

రామ్‌నగర్, జూన్ 27: చట్ట ప్రకారం వినియోగదారులకు న్యాణ్యతతో కూడిన ఆహారం వస్తు సామగ్రి ఉత్పత్తులను అందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ అన్నారు. గురువారం రామ్‌నగర్‌లోని స్థానిక సమావేశమందిరంలో ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు నాణ్యత పై అవగాహన తయారీ దారులకు నాణ్యమైన అవసరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు , ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులు తయారి దార్లు 2016 చట్టంప్రామాణీకీకరణ ప్రకారం నాణ్యత స్థాయిని పెంపుదల చేయాలని చట్ట ప్రకారం వినియోగదారునకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని తెలిపారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్

మహారాణిపేట, జూన్ 27: వచ్చే నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటి వద్దే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం ఆయ న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభు త్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కోసం శనివారమే బ్యాంకుల నుంచి నిధులు విత్‌డ్రా చేసుకోవా లని తెలిపారు. ఈ నెల పింఛన్ మొత్తం రూ.4 వేలతో మూడు నెలల ఎరియర్స్ రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.7 వేల నుంచి 11 కేటగిరీలకు చెందిన సామాజిక పింఛను దారులకు తప్పనిసరిగా ఇంటివద్దే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలని, అదే రోజు సాయంత్రానికి బట్వాడా పూర్తి కావాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి అవసరమైతే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి ఎకనాలెడ్జెమెంట్స్ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్‌అశోక్, జడ్పీ సీఈవో పోలినా

జిల్లా గ్రంథాలయ భవనం పునర్నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సేవా సమితి సభ్యులు

డాబాగార్డెన్స్, జూన్ 27: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలం ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉందని భవన పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు బి.ఎల్.నారాయణ కోరారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాణిపేట దండుబజార్‌లోని విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనాన్ని భూ బకాసురులు 2010లో కూల్చివేశారని, దీంతో పౌరగ్రంథాలయాల సేవా సమితి, పుర ప్రముఖులు పోరాటం ఫలితంగా 2014లో లీజు ఒప్పందం రద్దు చేశారన్నారు. ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ జీవీఎంసీ ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిన ఆస్తి పన్నులో 8 శాతం లైబ్రరీ సెస్ కోసం వెచ్చించాలని, ఈ మొత్తం రూ.200 కోట్లకుపైగా బకాయిఉందన్నారు. గ్రంథాలయ భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సేవా సమితి కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీఎల్ శాస్త్రి, మణి, ఎన్.ప్రకాశరావు, లక్ష్మీపతి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రుషికొండపై అక్రమ నిర్మాణంలో సీజెడ్‌ఎం ప్రేక్షకపాత్ర

- కేంద్ర ప్రభుత్వానికి మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మలేఖ

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రుషికొండపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్మించిన కట్టడం పూర్తిగా సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించిందని, ఈ విషయంలో రాష్ట్ర తీర ప్రాంత మేనేజ్‌మెంట్ అథారిటీ(సీజడ్‌ఎం) ప్రేక్షకపాత్ర పోషించిందని విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఈఏఎస్.శర్మ వ్యాఖ్యానించారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. రుషికొండపై ఏపీటీడీసీ నిర్మాణాలకు సంబంధించి సీఆర్‌జడ్ అనుమతులు రద్దుచేయాలని గత ఏడాది జూలై 14న రాసిన లేఖను ప్రస్తావించారు. ముందస్తు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. రుషికొండపై జరుగుతున్న కట్టడాలపై వాస్తవాలు ప్రజలకు చెప్పకుండా రహస్యంగా ఉంచారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పర్యాటకాభివృద్ధి సంస్థ చేపట్టిన కట్టడంపై వాస్తవాలు ప్రజలకు తెలిశాయన్నారు. ఈ విషయంలో కొందరు అధికారులు సీఆర్‌జడ్ నోటిఫికేషన్ పట్ల తక్కువ గౌరవం చూపించారని ఆక్షేపించారు. అనధికారికంగా నిర్మించిన అక్రమ కట్టడం వల్ల ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తీరం వెంబడి విచ్చలవిడిగా సీఆర్‌జడ్‌ను ఉల్లంఘనలో సీజడ్‌ఎం మూగ ప్రేక్షకుడిగా మారిందని తప్పుబట్టారు. తక్షణమే రుషికొండ నిర్మాణాల్లో చట్టాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే చివరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా చట్టబద్ధమైన ఉల్లంఘనల సంస్థగా మారిందనే అభిప్రాయానికి ప్రజలు వస్తారని స్పష్టం చేశారు.

టోల్‌గేట్‌పై రగడ

... 5వ పేజీ తరువాయి

హైకోర్టు తీర్పుపై నేషనల్ హైవే అథారిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు టోల్‌గేటును కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు 2019 జూలైలో మళ్లీ పునరుద్ధరించారు. దీనిపై అప్పటి నుంచి స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పూర్తిగా విస్మరించింది. స్థానిక ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదు. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు కూటమి అధికారంలోకి వస్తే టోల్‌గేటును తొలగించేలా చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఎంపీలు సహకారంతో అందుకోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఇదిలావుండగా స్థానికులు, కూటమి నాయకులు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన స్టాపర్లను తొలగించేశారు. ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం రాత్రి పూర్తిగా టోల్‌గేట్‌ను తొలగించేశారు.

ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల వాదన ఇదీ..

స్థానికులు వాదన ఇలా ఉండగా..నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం భిన్నంగా చెబుతున్నారు. నేషనల్ హైవే నిర్వహణ బాధ్యతను తామే చూస్తున్నామని, ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్నారు. జీ20 సదస్సు నేపథ్యంలో నేషనల్ హైవేపై ఉన్న గుంతలు పూడ్చేందుకు, ఇతరత్రా పనులకు రూ.15కోట్లు ఖర్చు చేశామంటున్నారు. నగరం నుంచి జాతీయ రహదారి వెళుతున్న నేపథ్యంలో లంకెలపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్, తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం, హనుమంతువాక, పీఎం పాలెం కార్‌షెడ్‌తో పాటు మొత్తం 12 చోట్ల పై ఓవర్ల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ పూనుకుందని, రూ.1200 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెబుతున్నారు. రోడ్ల నిర్వహణతో పాటు బ్రిడ్జిల రిపేర్లు, బస్ బే, లారీ బేల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని.. ఇదంతా టోల్ ఫీజు ద్వారా వస్తున్న ఆదాయంతోనే చేస్తున్నట్టు వెల్లడించారు. ఆ టోల్‌గేటును తొలగిస్తే ఈ పనులన్నీ నిలిచిపోతాయంటున్నారు. ఈ టోల్ గేటు గుండా ప్రతిరోజూ 45 వేల పాసింజర్ వెహికల్ యూనిట్లు (పీసీయు) ప్రయాణిస్తుంటాయని, వీటి ద్వారా రోజుకు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. టోల్‌గేటు తొలగిస్తే రోడ్డు నిర్వహణ నుంచి ఇతర పనులన్నీ నిలిచిపోయే అవకాశముందన్నారు. బుధవారం రాత్రి టోల్‌గేటును పూర్తిగా తొలగించడం వల్ల కోటి రూపాయలకుపైగా నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. ఒక్కో బూత్ ఏర్పాటుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించిన విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామని, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని స్థానిక అధికారులు వెల్లడించారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఎంత ఖర్చవుతుందనే అంచనా వేసి, అధికారుల ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలుస్తారు. తక్కువకు కోట్ చేసేవారికి పనులను అప్పగిస్తారు. పనులు ప్రారంభించినప్పటి నుంచి పూర్తయ్యేంత వరకూ నాణ్యత పాటించేలా చూసేందుకు ఇంజనీరింగ్ విభాగం నుంచి ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్ లేదంటే అసిస్టెంట్ ఇంజనీర్ ఒకరు దగ్గర ఉండాలి. సదరు ఉద్యోగి సమక్షంలోనే ప్రమాణాల ప్రకారం పనులు జరగాలి. కాంట్రాక్టర్ ఏమాత్రం తేడా చేసినా సదరు ఉద్యోగి అభ్యంతరం చెప్పడంతో పాటు నాణ్యత లేకుండా చేసిన పనిని తొలగించి తిరిగి చేయించాలి. అలాగే పనుల్లో నాణ్యతను ఇంజనీరింగ్ అధికారి ఒక్కరిపైనే పెడితే కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి థర్డ్ పార్టీ పేరుతో నాణ్యత పర్యవేక్షణకు ఒక ఏజెన్సీని నియమించుకుంటారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రతినిధితోపాటు థర్డ్ పార్టీ ఏజెన్సీ ప్రతినిధి కూడా పని జరుగుతున్న ప్రాంతంలో ఉండి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి. పని పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ అధికారి బిల్లు తయారుచేస్తే, థర్డ్ పార్టీ ఏజెన్సీ క్వాలిటీ సర్టిఫికెట్‌ను ఇస్తుంది. ఆ రెండింటిని కలిపి ఆడిట్ విభాగానికి సమర్పిస్తే కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపు ప్రక్రియ మొదలవుతుంది.

నాణ్యత పర్యవేక్షణ ఏదీ?

జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పర్యవేక్షించే నాథుడు కరువయ్యాడు. పని జరుగుతున్న చోట ఉండాల్సిన జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏదో మొక్కుబడిగా ఒకసారి అక్కడకు వెళ్లి..తన పనులపై బయటకు వెళ్లిపోతున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ కూడా చూసీచూడనట్టు పోతోంది. ఇంజనీరింగ్ విభాగం నుంచి గానీ, థర్డ్‌పార్టీ ఏజెన్సీ నుంచి గానీ ఎవరూ పని వద్ద ఉండకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా పనులు చేసుకుంటున్నారు. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేద. దీనివల్ల నగరంలో చేపడుతున్న నిర్మాణాల్లో చాలా వరకూ ఏడాది పూర్తికాకుండానే మరమ్మతులకు గురవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ, సిటీ పోలీస్ కమిషనర్ల బదిలీ?

... 5వ పేజీ తరువాయి

పెద్దలను కోరుతున్నారని, అందువల్లే ఆయన్ను బదిలీ జాబితాలో చేర్చినట్టు సమాచారం. మరోవైపు నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ కూడా బదిలీపై వెళ్లిపోతారనే ప్రచారం పోలీస్ శాఖలో సాగుతోంది. గత ఏడాది సెప్టెంబరు 14న సీపీగా బాధ్యతలు చేపట్టిన రవిశంకర్ అయ్యన్నార్ అదనపు డీజీపీ స్థాయి అధికారి కాగా నగర పోలీస్ కమిషనర్ పోస్టు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) స్థాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను బదిలీ చేసి ఐజీ స్థాయి అధికారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతల కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా అనుమతులు మంజూరుచేసి, కూటమి నేతల సభలు, కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడానికి ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలు సీపీపై ఉన్నాయి. పోలింగ్ తర్వాత కంచరపాలెం బర్మా కాలనీలో టీడీపీకి ఓటేశారనే కారణంతో ఒక కుటుంబంపై కొంత మంది దాడి చేస్తే, ఆ ఘటనకు రాజకీయాలకు సంబంధం లేదని సీపీ తేల్చిపారేశారని, పైగా దీనిపై ప్రెస్‌మీట్ పెట్టి ఆ గొడవకు వ్యక్తిగత కక్షలే కారణమని సీపీ చెప్పడమే కాకుండా, డీసీపీ-2తో కూడా చెప్పించారని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రభుత్వం బదిలీ చేస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం లేదా శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉందని జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు.

ఫిల్మ్ క్లబ్బు... వైసీపీ గబ్బు

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఇస్తున్నారు. క్లబ్‌కు శాశ్వత భవనాల కోసం 2019లో తెలుగుదేశం ప్రభుత్వం రామానాయుడు స్టూడియో వద్ద ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దానిని బదలాయించుకునేలోపు ప్రభుత్వం మారిపోయింది. ఆ భూమి వచ్చేలా చేస్తామని విజయ సాయిరెడ్డి బృందం క్లబ్‌ను లాగేసుకుంది. ఐదేళ్లలో ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు. క్లబ్‌కు సభ్యత్వ రుసుముల కింద కోట్ల రూపాయల ధనం సమకూరడంతో దానిని పక్కదారి పట్టించడానికి కాయల వెంకటరెడ్డి అండ్ కో భీమిలి వద్ద వివాదాస్పద స్థలాన్ని రూ.20 కోట్లతో కొనే ప్రయత్నం చేశారు. సభ్యులు కొందరు ప్రశ్నించడంతో ఆ ప్రయత్నం ఆగింది. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి రావడంతో, నాడు రామానాయుడు స్టూడియో వద్ద ఇచ్చిన ఐదు ఎకరాల జీవో ఇంకా మనుగడలోనే ఉన్నదని, దానిని సాకారం చేస్తామని, డబ్బులు కొంత ఖర్చు అవుతాయంటూ కొత్త పల్లవి అందుకున్నారు. దీనిపై రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే అడ్డగోలుగా వచ్చి శాశ్వత కమిటీగా ఏర్పడిన వారంతా తక్షణమే క్లబ్ నుంచి బయటకు వెళ్లాలని అత్యధికులు డిమాండ్ చేస్తున్నారు. క్లబ్ ఉన్న భీమిలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఇటీవల ఓ సమావేశం నిర్వహించి, మర్యాదగా తప్పుకోవాలని సూచించారు. వారంతా బయటకు వెళ్లకపోతే న్యాయబద్ధంగా పంపిస్తామని సభ్యులు చెబుతున్నారు. అద్దె స్థలంలో ఉంటూ రూ.1.5 కోట్లతో చిన్న చిన్న పనులు చేసి నిధులు దుర్వినియోగం చేశారని, అక్కడి లాన్స్‌కి కూడా 'వైఎస్ఆర్ లాన్స్ అని పేరు పెట్టారని, దీనిని పూర్తిగా ఫిల్మ్ క్లబ్‌లా కాకుండా వైఎస్ఆర్ పార్టీ క్లబ్‌లా మార్చేశారని అంతా ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.

పీజీ సెట్‌లో సత్తా చాటారు

... 5వ పేజీ తరువాయి

సిరిపురపు సాయి ప్రణీత రెండో ర్యాంకు, ఎలక్ట్రానిక్స్‌లో సీతంపేటకి చెందిన తుట్టా తారక్‌స్వరూప్ పదో ర్యాంకు, ఇంగ్లీష్‌లో రేసపువానిపాలెంకి చెందిన గుజ్జు సిద్ధ గాయత్రి 11వ ర్యాంకు, కైలాసపురానికి చెందిన పీతల జూహిత 11వ ర్యాంకు, ఫుడ్, న్యూట్రిషియన్ అండ్ డైటిక్స్‌లో పంజాబీ హోటల్ సమీపాన సాయినగర్‌కు చెందిన పూజారి హారిక మూడో ర్యాంకు, పెందుర్తికి చెందిన రెడ్డి జ్యోతిర్మయి నాలుగో ర్యాంకు, మహారాణిపేటకు చెందిన అదపాక నిషిత 12వ ర్యాంకు సాధించారు. జియాలజీలో పెందుర్తికి చెందిన కిల్లో చాందిని రెండో ర్యాంకు, హిందీలో సీతమ్మధారకి చెందిన ఫరూఖున్నీషా ఆరో ర్యాంకు, లైఫ్ సైన్సెస్‌లో గాజువాకకి చెందిన బోర వసంత్ ఆరో ర్యాంకు, మ్యాథమెటికల్ సైన్స్‌లో గాజువాకకి చెందిన వాకాడ చంద్రిక తొమ్మిదో ర్యాంకు, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో సిరిపురం వాసి చీరకాషు సాయి శ్రావణి ఎనిమిదో ర్యాంకు, పొలిటికల్ సైన్స్‌లో పెందుర్తికి చెందిన బి.అనన్య సాహితీ ఏడో ర్యాంకు, గాజువాకకు చెందిన గుంప దుర్గ పదో ర్యాంకు, జువాలజీలో సాగర్‌నగర్‌కి చెందిన పప్పల మానససాయి లక్ష్మి రెండు, పెందుర్తికి చెందిన బొడ్డేడ మౌనిక ఏడు, అల్లిపురానికి చెందిన కొల్లి వెంకటసాయి ఆకాష్‌రెడ్డి తొమ్మిదో ర్యాంకు సాధించారు. సైకాలజీలో దువ్వాడకి చెందిన నందినీ సంతోష్ ఐదో ర్యాంకు, అగనంపూడికి చెందిన గేదెల నిహారిక ఐదో ర్యాంకు సాధించారు. స్టాటిస్టిక్స్‌లో అక్కయ్యపాలెం అశ్వినీ చౌదరి నాలుగో ర్యాంకు, టూరిజంలో పద్మానాభం ప్రాంతానికి చెందిన దీర మణికంఠ మూడో ర్యాంకు సాధించి సత్తా చాటారు.



అధికారులతో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట-లక్ష్మీపురం రోడ్డును పరిశీలించిన పంచకర్ల

వేపగుంట, జూన్ 27: వేపగుంట నుంచి చీమలాపల్లి మీదుగా వెళ్లే లక్ష్మీపురం రోడ్డు అధ్వానంగా ఉండడంతో, ఈ రహదారి నిర్మాణంపై గురువారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా వేపగుంట నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో ఆయన నడిచి వెళ్లి రోడ్డుపై ఉన్న గోతులను తిలకించారు. అనంతరం జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ రోడ్డు గోతులతో చాలా అధ్వానంగా ఉందని, రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌అండ్‌బీ రహదారి అయినప్పటికీ లక్ష్మీపురం ఫ్లైఓవర్ వద్ద ఒక లేయర్ రోడ్డు నిర్మించాలన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం, టెండర్ పిలిచి కాంట్రాక్టరును ఎంపిక చేయడం జరిగిందని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట జెడ్సీ కె.హేమావతి, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ విజయకుమార్ కూటమి నాయకులు పిల్లా జగన్ మోహన్‌పాత్రుడు, పిన్నింటి పార్వతి, నాగరాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 27: ఉక్కు టౌన్‌షిప్‌లో ఉన్న జగన్నాథస్వామి రథోత్సవాలను జూలై ఏడో తేదీ నుంచి వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఒడిశాలోని పూరీలో మాదిరిగానే సంప్రదాయబద్ధంగా ఇక్కడా ఒరియా పూజార్లు పూజలు జరుపుతారు. స్వామివారి దర్శనానికి విచ్చేసే వందలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.

2న వేపాడమ్మ పండుగ

పెందుర్తి-రూరల్, జూన్ 27: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పోర్లుపాలెం, సూర్యరత్న కాలనీల ప్రజల ఆరాధ్య దేవత వేపాడమ్మ పండుగను జూలై రెండున ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం తొలేళ్ల ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, జూన్ 27: చినముషిడివాడలో కార్యసిద్ధిపంచముఖ వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ శాశ్వత ధర్మకర్త శేనాపతి వసంత శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకం, సహస్ర నాగవల్లీ సిందూరార్చన, తదితర పూజాది కార్యక్రమాలను జరుపుతామన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన చేపడతామన్నారు.

ముగిసిన మరిడిమాంబ ఉత్సవాలు

సింధియా, జూన్ 27: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో మరిడిమాంబ జరుగుతున్న ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపాలైనా ఘటాలను గురువారం పురవీధుల్లో ఊరేగించాక తిరిగి మరిడిమాంబ సన్నిధికి తీసుకువచ్చారు. అనంతరం కార్పొరేటర్ గల్లా చిన్నా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెర్రిపోతుల నర్సింగ్, జి.శివ, నాని, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మికాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 78, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారేట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 140, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వార్డుల్లో గణబాబు సుడిగాలి పర్యటన

గెడ్డల నీరు దిగువ ప్రాంతాలకు సక్రమంగా పారేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



గుల్లలపాలెం గెడ్డను పరిశీలిస్తున్న గణబాబు, సాయికాంత్‌వర్మ, తదితరులు

మల్కాపురం, జూలై 27: జీవీఎంసీ 58,60 వార్డుల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు గ్రేటర్ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. గురువారం ఉదయం ఏడు గంటలకే ఆయన ఇక్కడకు చేరుకుని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందుగా 58వ వార్డు పరిధి శ్రీహరిపురం గుల్లలపాలెం, రామ్‌నగర్ గెడ్డలు, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గుర్తించారు. అందుకు ప్రధాన కారణం హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీల యాజమాన్యాలు ఏర్పాటు చేయించిన రక్షణ గోడలేనని ఎమ్మెల్యే, కమిషనర్, గుర్తించారు. ఆయా కంపెనీల రక్షణార్థం ఏర్పాటు చేసిన గ్రిల్స్ వల్ల గెడ్డలు, కాలువల్లోని మురుగు నీరు సజావుగా సముద్రంలోకి వెళ్లడం లేదని, అందువల్ల ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు గణబాబు సూచించారు.

వర్షాలను దృష్టిలో పెట్టుకుని త్వరిత గతిన సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం వారు హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీలను సందర్శించి అధికారులతో మాట్లాడారు. రక్షణ గోడల వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్స్ వల్ల ఎగువ ప్రాంతాల నుంచి గెడ్డల ద్వారా వచ్చే నీరు సజావుగా ముందుకు సాగడం లేదని, ఒక్కోసారి మురుగు నీరు సమీప ప్రాంతాల్లోకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందువల్ల గెడ్డల నుంచి నీరు సజావుగా సముద్రంలోకి కలిసేలా గ్రిల్స్‌ను తొలగించాలని సూచించారు. ఆ తర్వాత మల్కాపురం శ్మశానవాటికను ఎమ్మెల్యే పరిశీలించి, దీని అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

ఆస్పత్రి నిర్వహణపై అసంతృప్తి

జీవీఎంసీ ఆస్పత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే గణబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసూతి వార్డు నిర్వహణ దారుణంగా ఉందని మండిపడ్డారు. రూ.లక్షలు విలువ చేసే సామగ్రిని నిర్లక్ష్యంగా మూలన ఇలా పడేస్తారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. త్వరలో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతను ఆరోగ్యశాఖ చూసుకుంటుందని, అప్పుడు సేవలు మెరుగుపడేలా చర్యలు చేపడతామని గణబాబు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెంట జీవీఎంసీ పర్యవేక్షణ ఇంజనీర్లు రవి, వినయ్‌కుమార్, ఏడీసీపీ డాక్టర్ వి.సన్యాసిరావు, జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సురేశ్‌కుమార్, అధికారులు బి.సురేశ్‌కుమార్, తారా ప్రసన్న, సుబ్బారావు, డాక్టర్ సునీల్‌కుమార్, ములగాడ తహసీల్దార్ శ్రీనివాస్ మిత్రా, హెచ్‌పీసీఎల్ సీజీఎం కిరణ్, పీఆర్‌వో కాళీ, కోరమాండల్ సీనియర్ అసోసియేట్ రంగనాయకులు, సీఎస్‌ఆర్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, పీఆర్‌వో శర్మ, తదితరులు ఉన్నారు.

సెయిల్‌లో విలీనం చేస్తే స్టీల్‌ప్లాంటుకు మంచి భవిష్యత్తు

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూన్ 27: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగ రావు అన్నారు. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలు బుధవారం కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడారన్నారు. అందువల్ల త్వరలోనే ప్లాంట్ విషయంలో శుభవార్త వినవచ్చన్నారు. తొలి నుంచి వామపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని, ప్లాంట్ పురోగతి కోసం బీజేపీ కృషి చేస్తుందని అయన పేర్కొన్నారు. ఉక్కు కార్మికులు వందలాది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా వైసీపీ నాయకులు చేసిందేమి లేదని విమర్శించారు. గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ కోసం ముందుగా ఉద్యమం చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, లక్ష్మణరావు, గంధం వెంకటరావు, బాబు, యల్లాజీరావు, శంకరరావు, వి.ఈశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

1,232వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం అయ్యేలా చూడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,232వ రోజుకు చేరాయి. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాన్ని ఎలాగైతే ప్రతిష్ఠాత్మకంగా కూటమి నాయకులు తీసుకున్నారో.. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంటును నష్టాల బాట పట్టేలా చేయడం, కార్మికులకు జీతాలివ్వలేని దుస్థితికి దిగజార్చడం పారిశ్రామిక అభివృద్ధా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీసీహెచ్ వెంకటేశ్వరరావు, యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, శ్రీనివాస్, రాజు, జయ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కురిలే నిరాహారదీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షల ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గురువారం ప్రకటించారు. ఇందలో భాగంగా జూలై ఒకటిన ఎల్‌ఎంఎంఎం, ఎస్‌బీఎం, రెండున ఈఎస్‌ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, భద్రత, టెలికాం, మూడున డబ్ల్యూఆర్‌ఎం, నాలుగున ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం, ఐదున ఎస్‌ఎంఎస్, ఆరున సీఎంఎం, సీఆర్‌ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, ఏడున కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), ఎనిమిదిన కోక్ ఓవెన్, తొమ్మిదిన సింటర్ ప్లాంట్, పదిన బ్లాస్ట్ ఫర్నేస్ ఉద్యోగులు దీక్షల్లో కూర్చుంటారు. అదేవిధంగా 11వ తేదీన ఎస్‌ఎంఎస్-2, 12న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్ ఆర్‌ఎండీ, 13న ఎల్‌ఎంఎంఎం, ఎస్‌బీఎం, 14న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 15న ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం, 16న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, ఆర్‌అండ్‌డీ, టెలికాం, ఈటీఎల్, డిఎన్‌డబ్ల్యూ, 17న ఓబీసీ అసోసియేషన్, 18న ఎస్‌ఎంఎస్-1, 19న ఎఫ్‌ఎండీ, ఆర్‌ఎస్‌అండ్‌ఆర్‌ఎస్, ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, 20న డబ్ల్యూఎండీ, యుటిలిటిస్, ఏడీఎం, టీపీ, టీటీఐ ఉద్యోగులు దీక్షల్లో పాల్గొంటారు. 21న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 22న టీపీపీ, ఆర్‌ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఆర్‌ఈడీ, 23న సింటర్ ప్లాంట్, 24న కోకోఓవెన్, 25న బ్లాస్ట్‌ఫర్నేస్, 26న ఆర్‌ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్‌ఆర్, 27న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్ ఆర్‌ఎండీ, 28న కాంట్రాక్టు కార్మికులు (హెచ్‌ఎంఎస్), 29న ఎస్‌ఎంఎస్-2, 30న డబ్ల్యూఆర్‌ఎం, 31న ఎస్‌ఎంఎస్-1 విభాగాల ఉద్యోగులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చుంటారని నాయకులు పేర్కొన్నారు.

వెంకన్నపాలెంలో రోడ్డు ప్రమాదం: ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన సతీశ్‌కుమార్, దెబ్బతిన్న బైకు

పెదగంట్యాడ, జూన్ 27: పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే రోడ్డులో వెంకన్నపాలెం జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మితిమీరిన వేగంతో వచ్చిన కారు వీరిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన బాధితులు గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్కి సినిమాను చూసేందుకు గంగవరానికి చెందిన ఎ.సతీశ్‌కుమార్ (28), ఎ.దేముడు (25)లు బైకుపై బయలుదేరారు. ఈ క్రమంలో వెంకన్నపాలెం జంక్షన్‌కు వచ్చేసరికి తమ స్నేహితుడు చోడిపిల్లి రమేష్ (32) కనిపించడంతో ఆగారు. రోడ్డు పక్కన ఈ ముగ్గురూ మాట్లాడుకొంటుండగా గంగవరం వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు వీరితో పాటు బైకును ఢీకొంది. దీంతో ఈ ముగ్గురికీ తీవ్ర గాయాలవ్వడంతో పాటు బైకు బాగా దెబ్బతింది. గాయపడిన వీరిని స్థానికులు గాజువాకలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. న్యూపోర్టు పోలీసులు కారు డ్రైవర్ ఎం.జగదీశ్వరరావును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పల్లా శ్రీనివాసరావును సత్కరించి, వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'పల్లా'ను కలిసిన నేవల్ సివిలియన్ నాయకులు

గాజువాక, జూన్ 27: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. రక్షణ రంగంలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణను నిలిపివేసి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గాజువాక ప్రాంతం నుంచి విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్, రైల్వే క్రాసింగ్ గేట్ల సమస్యలపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, టీఎన్‌టీయూసీ, జేసీఎం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక డిపో వద్ద నిరంతర నిఘా



వీఆర్వోకు సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి

అగనంపూడి, జూన్ 27: అగనంపూడి వద్ద గల ప్రభుత్వ ఇసుక డిపో వద్ద నిఘా ఏర్పాటు చేసినట్టు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి పేర్కొన్నారు. గురువారం ఆమె సిబ్బందితో కలిసి ఇక్కడి ఇసుక డిపోను పరిశీలించారు. ఇసుక పాలసీ వచ్చేంత వరకు డిపో నుంచి ఇసుక తరలించడానికి వీల్లేదన్నారు. ఎవరైనా డిపో నుంచి ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. డిపో వద్ద 24 గంటలూ వీఆర్వోతో నిఘా పెట్టినట్టు శ్రీవల్లి తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, జూన్ 27: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యాధికారి కె.కళావతి సూచించారు. పెదమడకలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, ఈ కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సీజనల్ జ్వరాలు వస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాక పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

గాజువాక, జూన్ 27: తమ కుమార్తె ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు గురువారం గాజువాక పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతానికి చెందిన ఎం.పద్మిని ఈ నెల ఒకటిన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, ఆమెను గమనించి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందింది. అప్పట్లో ఆత్మహత్య కింద కేసు నమోదు చేసినప్పటికీ మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు. పద్మిని భర్త సోమేశ్, అత్త కట్నం వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని, వారిని అరెస్టు చేయాలంటూ తల్లిదండ్రులు మొల్లి అప్పారావు, రమణమ్మతో పాటు బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. సోమేశ్‌తో పాటు ఆమె తల్లిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పడంతో వారు ధర్నా విరమించారు.

పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐగా నరసింగరాజు



బాధ్యతలు చేపడుతున్న నరసింగరాజు

పెందుర్తి, జూన్ 27: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్.నరసింగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు స్పెషల్ బ్రాంచిలో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు కార్యచరణ ప్రణాళికతో తగిన చర్యలు చేపడతానన్నారు. ప్రజల సహకారంతో అతి వేగం, డ్రంకన్ డ్రైవ్ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేటర్ దంపతులకు సత్కారం



లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి దంపతులను సత్కరించిన దృశ్యం

పెదగంట్యాడ, జూన్ 27: జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి దంపతులను టీడీపీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు విజయానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షునిగా పులి వెంకటరమణారెడ్డి, కార్పొరేటర్‌గా లక్ష్మీబాయి నిర్విరామంగా కృషి చేశారని పలువురు కొనియాడారు. నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య టి.అప్పారావు, మొల్లి రమణబాబు, ఈశ్వరరావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



యారాడ రోడ్డులో పిక్కరాయి వేయడంతో ఒరిగిన సూచిక బోర్డు

ఇష్టారాజ్యంగా పిక్క, ఇసుక డంపింగ్

యారాడ రోడ్డులో నేలకొరుగుతున్న సూచిక బోర్డులు

సింధియా, జూన్ 27: సింధియా నుంచి యారాడకు వెళ్లే మార్గంలో గమ్యాన్ని చూపించే సూచిక బోర్డులు నేలమట్టమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మార్గంలో రోడ్డుకు ఇరుపక్కల ఉన్న సూచిక బోర్డులపై స్థానిక భవన నిర్మాణదారులు ఇష్టానుసారంగా ఇసుక, పిక్కను డంపింగ్ చేస్తున్నారు. దీంతో సూచిక బోర్డులు నేలకొరుగుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల సూచిక బోర్డులు కనుమరుగయ్యాయి. దీంతో యారాడ సముద్ర తీరాన్ని వీక్షించేందుకు వస్తున్న సందర్శకులు సూచిక బోర్డులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ఒరిగిన సూచిక బోర్డులను సరిచేసి, వాటిపై ఎవరూ భవన నిర్మాణ సామగ్రి వేయకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కు ఎస్‌డీసీ విచారణ



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీసీ సునీత

కూర్మన్నపాలెం, జూన్ 27: ఉక్కు భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత గురువారం 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితి, ఎరుకులవీధి, రాజుల పాలెం, లక్ష్మీపురంలలో పర్యటించి పలు అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టారు. ఉక్కు భూ సేకరణ విభాగం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై లక్ష్మీపురానికి చెందిన బి.లక్ష్మి అనే మహిళ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌డీసీ విచారణ జరిపారు. లక్ష్మీపురంలో మరుగు దొడ్డి నిర్మిస్తున్నందుకు డబ్బులు డిమాండ్ చేశారని, ఎరుకుల వీధిలో ఆర్ఐ భార్యకు చెందిన స్థలానికి పక్కనున్న కొంత స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్‌డీసీ సునీత ఆయా స్థలాలను పరిశీలించడంతో పాటు బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనధికార నిర్మాణాలను ఎవరు చేపట్టినా తొలగిస్తామని ఎస్‌డీసీ హెచ్చరించారు.

1 నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏజే స్టాలిన్, తదితరులు

గాజువాక, జూన్ 27: నగరంలోని మురళీనగర్‌లో జూలై ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరగనున్నట్టు పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ పేర్కొన్నారు. గాజువాకలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద పార్టీ బీజేపీతో ప్రస్తుత ప్రభుత్వం అంటకాగడాన్ని ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం చేయరాదన్నారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ ఏర్పాటు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. రాగా మూడు రోజుల పాటు జరిగే సమితి సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, యేల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, దుర్గారావు, పోతయ్య రాజుబాబు, అచ్యుతరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్‌ను అడ్డుకున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం, జూన్ 27: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి పరిధి శ్రీగణేశ్ నగర్ నుంచి కూర్మన్నపాలెంలోని ఎంవీవీఎంకే పార్కులో గృహ సముదాయానికి అనధికారంగా నీటితో తరలిస్తున్న ట్యాంకర్‌ను గురువారం కార్పొరేటర్ బొండా జగన్‌తో పాటు స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీవీఎంకే పార్కు గృహ సముదాయం నిర్మించి ఏడాది కాకుండానే అక్కడ తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. దీంతో అనధికారికంగా మోటార్లతో భూగర్భ జలాలను తోడి నిరంతరాయంగా తాగునీటిని తరలిస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ గృహ సముదాయాన్ని శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసి నిర్మించారని, ఇక్కడ డ్రైనేజీల సమస్య నెలకొందని పలుమార్లు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఫిర్యాదులు చేసినా గత వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా చర్యలు చేపట్టిందే తప్ప ప్రజలకు న్యాయం చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాగునీటి ట్యాంకర్‌ను అడ్డుకుని కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు.

హెచ్‌ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్‌గా ఆల్ఫా కృష్ణ

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 27: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) జాతీయ కన్వీనర్‌గా బీఎస్ (ఆల్ఫా) కృష్ణను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఎన్‌ఏడీ కొత్త రోడ్డు లోని ఆల్ఫా హోటల్‌లో హెచ్‌ఆర్‌సీఐ భవిష్యత్తు ప్రణాళికలపై ఆల్ఫా కృష్ణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా, మానవ హక్కులకు భంగం వాటిల్లినా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎన్‌ఏడీ కొత్త రోడ్డులో త్వరలో హెచ్‌ఆర్‌సీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయనను హెచ్‌ఆర్‌సీఐ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర అధ్యక్షుడు జె.నానాజీ, లీగల్ అడ్వైజర్ ఎం.రాజేశ్వరరావు, ప్రతినిధులు సెల్వాని, చారేంద్ర, జయకృష్ణ, వెంకటకృష్ణ, ఏకే రాజు, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో వృథాగా పోతున్న తాగునీరు



పైపులైన్ నుంచి లీక్ అవుతున్న తాగునీరు

కూర్మన్నపాలెం, జూన్ 27: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా ఫేజ్-5లో పైపులైన్ లీకై తాగునీరు డ్రైనేజీల్లో కలిసిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీ వల్ల సరిపడినంత నీరందక ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. దీంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పైపులైన్ల లీకేజీలపై జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

ఆటోనగర్, జూన్ 27: గ్రేటర్ 71వ వార్డు శ్రీనగర్‌లో సీఎల్‌సీ సంస్థ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో గురువారం వందమంది పేదలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పేదలు, నిరాశ్రయులకు సేవలందించడంతో పాటు రక్త, వైద్య శిబిరాలను మురికివాడల్లో నిర్వహిస్తున్నామన్నారు. కాలనీల్లో బోర్ల ఏర్పాటు, అన్నదానాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మెర్సీ మహంతి, ఆల్‌ఫ్రెడ్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 27: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్, వుడా కాంప్లెక్స్ ఏరియా, టీపీటీ కాలనీ, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వెనుక, రసపూర్ణ వెనుక, సీతమ్మధార ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోర్టు అథారిటీ బోర్డు సభ్యుడిగా పోతన్న


యు.పోతన్న

అక్కయ్యపాలెం, జూన్ 27 : విశాఖపట్నం హార్బర్, పోర్టు వర్కర్స్ ఏఐటీయూసీ నాయకుడు యు.పోతన్న విశాఖ పోర్టు అథారిటీ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కవచం ఏర్పాటు


గ్రీన్‌బెల్ట్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్

కంచరపాలెం, జూన్ 27: కంచరపాలెం నుంచి బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ చుట్టూ జీవీఎంసీ అధికారులు రక్షణకవచాన్ని ఏర్పాటు చేస్తుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రీన్‌బెల్ట్‌కు సరైన రక్షణ లేకపోవడంతో చీకటి పడగానే మందుబాబులు ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు. ప్రస్తుతం తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు గల బెల్ట్‌కు ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేసి లోపలకు ఎవరు ప్రవేశించలేని రీతిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో గ్రీన్‌బెల్ట్ పరిసరాలు సుందరంగా మారాయి. ఈ నేపథ్యంలో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి పండగ

మాధవధార, జూన్ 27: జీవీఎంసీ 51వవార్డు సీతన్న గార్డెన్స్‌లో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉదయం నుంచి వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటరు రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విశేష అలంకరణలో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

లలితాపీఠంలో కవితా గోష్ఠి


అనుగ్రహభాషణం చేస్తున్న సిద్ధేశ్వరానంద

అక్కయ్యపాలెం, జూన్ 27: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితాపీఠంలో గురువారం ఆధ్యాత్మిక కవితా గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద ఆవిష్కరించారు. సభకు ఆచార్య కొలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. డాక్టర్ డీవీ సూర్యారావు కవితా గోష్ఠిని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సభలో పాల్గొన్న 24 మంది కవులను స్వామి సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.


పూర్ణామార్కెట్ వద్ద కాలువలోంచి రోడ్డుపైకి పొంగుతున్న మురుగు


మురుగు నీటితో నిండిపోయిన పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి

రహదారిపైకి భారీగా మురుగు నీరు

- పూర్ణామార్కెట్ పరిధిలో అస్తవ్యస్తంగా రహదారుల విస్తరణ
- కాలువల్లోంచి రోడ్లపైకి మురుగు
- నదులను తలపిస్తున్న రోడ్లు
- అధికారుల తీరుపై స్థానికుల విమర్శలు

పూర్ణామార్కెట్, జూన్ 27: పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డ విస్తరణ, కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు విస్తరణలో జీవీఎంసీ జోనల్, టౌన్ ప్లానింగ్ అధికారుల అనాలోచిత విధానాలతో కాలువల్లోంచి ప్రవహించాల్సిన మురుగునీరు రహదారులపైకి చేరుతోంది. ఫలితంగా పాదచారులు అవస్థలు పడాల్సి వస్తోంది. పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు బస్టాప్ వైపు పాత కాలువలపైనే పలకలు వేసి కలరింగ్ ఇచ్చారని, ఓ మోస్తరు వర్షం కురిసేసరికి మురుగు రోడ్డుపైకి ప్రవహించిదని వాపోతున్నారు. నగరంలో గురువారం వర్షం కురిసింది. దీంతో కాలువలు పొంగి పొర్లాయి. రహదారులు విస్తరణ చేపట్టే సమయంలో కాలువలను పటిష్ఠం చేయడం, కొత్తగా కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్ణామార్కెట్ మెయి న్ గేట్ వద్ద వైపు వర్షం నీరు కాలువల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డు మీదకు చేరింది. ఫలితంగా రహదారి చెరువును తలపించింది. బస్టాప్ వైపు కాలువలు నిర్మించకుండా పాత కాలువలపైనే టైల్స్ అతికించారని స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు ఇరువైపులా కొత్తగా కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని, అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక కొండ ఘాట్‌రోడ్డు వద్ద ...


ఘాట్‌రోడ్డు ప్రారంభంలో నిలిచిన నీరు

జగదాంబ కూడలి, జూన్ 27: సత్యనారాయణ స్వామి (ఇసుకకొండ) ఘాట్ రోడ్డు పూర్ణామార్కెట్ వైపు ప్రధాన మార్గం పరిస్థితి అదే రీతిలో ఉంది. ఇక్కడ రోడ్డు ఇరుగ్గా నిర్మించడంపై భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఘాట్ రోడ్డు మార్గం పైకి వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మార్గం పక్కన వక్ఫ్ బోర్డుకు చెందిన దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించి రోడ్డు నిర్మించేందుకు వీలున్నప్పటికీ జీవీఎంసీ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో చినుకు పడితే నీరంతా రోడ్డుపైనే నిలిచిపోయి కాలువను తలపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. కొండ మార్గం కాలువ నిర్మాణాలు సక్రమంగా జరగగపోవంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోందని, ఈ విషయం ఇంజనీరింగ్ అధికారులు గుర్తించాలని భక్తులు కోరుతున్నారు.

'శానిటరీ సిబ్బంది సేవలు నిరుపమానం'


ఆదినారాయణ దంపతులను సత్కరిస్తున్న గంకల అప్పారావు,సిబ్బంది

కంచరపాలెం, జూన్ 27: వార్డు అభివృద్ధిలో శానిటరీ సిబ్బంది సేవలు నిరుపమానమని జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన శానిటరీ సిబ్బంది ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన నాలుగు దశాబ్దాలు సేవలందించిన లింగాల ఆదినారాయణ దంపతులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వార్డు పరిశుభ్రతే ధ్యేయంగా పనిచేస్తున్న సిబ్బంది సేవలు కొనియాడారు. ప్రజారోగ్యంలో శానిటరీ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం ప్రతినిధి గోవింద్


ఎమ్మెల్యే వంశీకృష్ణతో గోవింద్, తదితరులు

పూర్ణామార్కెట్, జూన్ 27: నియోజవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణను పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి, నందమూరి అభిమానుల సంఘం ప్రతినిధి గంగాడ గోవింద్ కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేను కలిసి మంచి మెజారిటీతో విజయం సాధించినందుకు అభినందించారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో ప్రధాన సమస్యలు, ఘాట్ రోడ్డు నిర్మాణం, ముఖద్వారం నిర్మాణంలో లోపాలపై వివరించారు. నందమూరి అభిమానులు, వర్తకులు పాల్గొన్నారు.

ప్రోగ్రాం అధికారులతో డీఎంహెచ్‌వో సమావేశం


వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూన్ 27: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కేంద్రం బృందం సభ్యులు జితేంద్రసింగ్, ఎస్.పూజ, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావులు సంబంధిత ప్రోగ్రాం అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎనీమియా ముక్త భారత్ జిల్లాలో అమలుపై చర్చించిన అనంతరం హెల్త్ అవేర్‌నెస్ కేంద్రాలను, పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.సమతతో కలిసి మధురవాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలల్లో కార్యక్రమ అమలుతీరును తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే ఐరన్ సిరప్స్, మాత్రల వివరాలు, గర్భిణులు బాలింతల సంపూర్ణ పోషణ కార్యక్రమంలో వినియోగించే మాత్రలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జీవవనరాణి, బి.నాగేశ్వరరావు, ఉమాపతి, ప్రశాంతి, హీన దీక్షిత్, ఐ.మనోరమ, శాంతిప్రియ, నాగభూషణం పాల్గొన్నారు.

ఆరిలోవలో....

దుర్గా బజార్, ఆరిలోవలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను గురువారం జిల్లా వైద్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు సందర్శించి ఆరోగ్య సిబ్బందిని, ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

ఉత్పత్తుల నాణ్యతపై వినియోగదారులకు అవగాహన

రామ్‌నగర్, జూన్ 27: చట్ట ప్రకారం వినియోగదారులకు న్యాణ్యతతో కూడిన ఆహారం వస్తు సామగ్రి ఉత్పత్తులను అందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ అన్నారు. గురువారం రామ్‌నగర్‌లోని స్థానిక సమావేశమందిరంలో ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు నాణ్యత పై అవగాహన తయారీ దారులకు నాణ్యమైన అవసరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు , ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులు తయారి దార్లు 2016 చట్టంప్రామాణికీకరణ ప్రకారం నాణ్యత స్థాయిని పెంపుదల చేయాలని చట్ట ప్రకారం వినియోగదారునకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని తెలిపారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్

మహారాణిపేట, జూన్ 27: వచ్చే నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటి వద్దే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కోసం శనివారమే బ్యాంకుల నుంచి నిధులు విత్‌డ్రా చేసుకోవాలని తెలిపారు. ఈ నెల పింఛన్ మొత్తం రూ.4 వేలతో మూడు నెలల ఎరియర్స్ రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.7 వేల నుంచి 11 కేటగిరీలకు చెందిన సామాజిక పింఛను దారులకు తప్పనిసరిగా ఇంటివద్దే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలని, అదే రోజు సాయంత్రానికి బట్వాడా పూర్తి కావాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి అవసరమైతే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి ఎకనాలెడ్జెమెంట్స్ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్‌అశోక్, జడ్పీ సీఈవో పోలినా

జిల్లా గ్రంథాలయ భవనం పునర్నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సేవా సమితి సభ్యులు

డాబాగార్డెన్స్, జూన్ 27: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలం ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉందని భవన పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు బి.ఎల్.నారాయణ కోరారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాణిపేట దండుబజార్‌లోని విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనాన్ని భూ బకాసురులు 2010లో కూల్చివేశారని, దీంతో పౌరగ్రంథాలయాల సేవా సమితి, పుర ప్రముఖులు పోరాటం ఫలితంగా 2014లో లీజు ఒప్పందం రద్దు చేశారన్నారు. ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ జీవీఎంసీ ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిన ఆస్తి పన్నులో 8 శాతం లైబ్రరీ సెస్ కోసం వెచ్చించాలని, ఈ మొత్తం రూ.200 కోట్లకుపైగా బకాయిఉందన్నారు. గ్రంథాలయ భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సేవా సమితి కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీఎల్ శాస్త్రి, మణి, ఎస్.ప్రకాశరావు, లక్ష్మీపతి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రుషికొండపై అక్రమ నిర్మాణంలో సీజెడ్ఎం ప్రేక్షకపాత్ర

- కేంద్ర ప్రభుత్వానికి మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రుషికొండపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్మించిన కట్టడం పూర్తిగా సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించిందని, ఈ విషయంలో రాష్ట్ర తీర ప్రాంత మేనేజ్‌మెంట్ అథారిటీ(సీజడ్ఎం) ప్రేక్షకపాత్ర పోషించిందని విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఈఏఎస్.శర్మ వ్యాఖ్యానించారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. రుషికొండపై ఏపీటీడీసీ నిర్మాణాలకు సంబంధించి సీఆర్‌జడ్ అనుమతులు రద్దుచేయాలని గత ఏడాది జూలై 14న రాసిన లేఖను ప్రస్తావించారు. ముందస్తు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. రుషికొండపై జరుగుతున్న కట్టడాలపై వాస్తవాలు ప్రజలకు చెప్పకుండా రహస్యంగా ఉంచారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పర్యాటకాభివృద్ధి సంస్థ చేపట్టిన కట్టడంపై వాస్తవాలు ప్రజలకు తెలిశాయన్నారు. ఈ విషయంలో కొందరు అధికారులు సీఆర్‌జడ్ నోటిఫికేషన్ పట్ల తక్కువ గౌరవం చూపించారని ఆక్షేపించారు. అనధికారికంగా నిర్మించిన అక్రమ కట్టడం వల్ల ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తీరం వెంబడి విచ్చలవిడిగా సీఆర్‌జడ్‌ను ఉల్లంఘనలో సీజడ్ఎం మూగ ప్రేక్షకుడిగా మారిందని తప్పుబట్టారు. తక్షణమే రుషికొండ నిర్మాణాల్లో చట్టాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే చివరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా చట్టబద్ధమైన ఉల్లంఘనల సంస్థగా మారిందనే అభిప్రాయానికి ప్రజలు వస్తారని స్పష్టం చేశారు.

టోల్‌గేట్‌పై రగడ

... 5వ పేజీ తరువాయి

హైకోర్టు తీర్పుపై నేషనల్ హైవే అథారిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు టోల్‌గేటును కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు 2019 జూలైలో మళ్లీ పునరుద్ధరించారు. దీనిపై అప్పటి నుంచి స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పూర్తిగా విస్మరించింది. స్థానిక ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదు. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు కూటమి అధికారంలోకి వస్తే టోల్‌గేటును తొలగించేలా చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఎంపీలు సహకారంతో అందుకోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఇదిలావుండగా స్థానికులు, కూటమి నాయకులు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన స్టాపర్లను తొలగించేశారు. ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం రాత్రి పూర్తిగా టోల్‌గేట్‌ను తొలగించేశారు.

ఎన్‌హెచ్ఏఐ అధికారుల వాదన ఇదీ..

స్థానికులు వాదన ఇలా ఉండగా..నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం భిన్నంగా చెబుతున్నారు. నేషనల్ హైవే నిర్వహణ బాధ్యతను తామే చూస్తున్నామని, ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్నారు. జీ20 సదస్సు నేపథ్యంలో నేషనల్ హైవేపై ఉన్న గుంతలు పూడ్చేందుకు, ఇతరత్రా పనులకు రూ.15కోట్లు ఖర్చు చేశామంటున్నారు. నగరం నుంచి జాతీయ రహదారి వెళుతున్న నేపథ్యంలో లంకెలపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్, తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం, హనుమంతువాక, పీఎం పాలెం కార్‌షెడ్‌తో పాటు మొత్తం 12 చోట్ల పై ఓవర్ల నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ పూనుకుందని, రూ.1200 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెబుతున్నారు. రోడ్ల నిర్వహణతో పాటు బ్రిడ్జిల రిపేర్లు, బస్ బే, లారీ బేల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని.. ఇదంతా టోల్ ఫీజు ద్వారా వస్తున్న ఆదాయంతోనే చేస్తున్నట్టు వెల్లడించారు. ఆ టోల్‌గేటును తొలగిస్తే ఈ పనులన్నీ నిలిచిపోతాయంటున్నారు. ఈ టోల్ గేటు గుండా ప్రతిరోజూ 45 వేల పాసింజర్ వెహికల్ యూనిట్లు (పీసీయు) ప్రయాణిస్తుంటాయని, వీటి ద్వారా రోజుకు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. టోల్‌గేటు తొలగిస్తే రోడ్డు నిర్వహణ నుంచి ఇతర పనులన్నీ నిలిచిపోయే అవకాశముందన్నారు. బుధవారం రాత్రి టోల్‌గేటును పూర్తిగా తొలగించడం వల్ల కోటి రూపాయలకుపైగా నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. ఒక్కో బూత్ ఏర్పాటుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించిన విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామని, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని స్థానిక అధికారులు వెల్లడించారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

ఎంత ఖర్చవుతుందనే అంచనా వేసి, అధికారుల ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలుస్తారు. తక్కువకు కోట్ చేసేవారికి పనులను అప్పగిస్తారు. పనులు ప్రారంభించినప్పటి నుంచి పూర్తయ్యేంత వరకూ నాణ్యత పాటించేలా చూసేందుకు ఇంజనీరింగ్ విభాగం నుంచి ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్ లేదంటే అసిస్టెంట్ ఇంజనీర్ ఒకరు దగ్గర ఉండాలి. సదరు ఉద్యోగి సమక్షంలోనే ప్రమాణాల ప్రకారం పనులు జరగాలి. కాంట్రాక్టర్ ఏమాత్రం తేడా చేసినా సదరు ఉద్యోగి అభ్యంతరం చెప్పడంతో పాటు నాణ్యత లేకుండా చేసిన పనిని తొలగించి తిరిగి చేయించాలి. అలాగే పనుల్లో నాణ్యతను ఇంజనీరింగ్ అధికారి ఒక్కరిపైనే పెడితే కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి థర్డ్ పార్టీ పేరుతో నాణ్యత పర్యవేక్షణకు ఒక ఏజెన్సీని నియమించుకుంటారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రతినిధితోపాటు థర్డ్ పార్టీ ఏజెన్సీ ప్రతినిధి కూడా పని జరుగుతున్న ప్రాంతంలో ఉండి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి. పని పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ అధికారి బిల్లు తయారుచేస్తే, థర్డ్ పార్టీ ఏజెన్సీ క్వాలిటీ సర్టిఫికెట్‌ను ఇస్తుంది. ఆ రెండింటిని కలిపి ఆడిట్ విభాగానికి సమర్పిస్తే కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపు ప్రక్రియ మొదలవుతుంది.

నాణ్యత పర్యవేక్షణ ఏదీ?

జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పర్యవేక్షించే నాథుడు కరువయ్యాడు. పని జరుగుతున్న చోట ఉండాల్సిన జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏదో మొక్కుబడిగా ఒకసారి అక్కడకు వెళ్లి..తన పనులపై బయటకు వెళ్లిపోతున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ కూడా చూసీచూడనట్టు పోతోంది. ఇంజనీరింగ్ విభాగం నుంచి గానీ, థర్డ్‌పార్టీ ఏజెన్సీ నుంచి గానీ ఎవరూ పని వద్ద ఉండకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా పనులు చేసుకుంటున్నారు. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీనివల్ల నగరంలో చేపడుతున్న నిర్మాణాల్లో చాలా వరకూ ఏడాది పూర్తికాకుండానే మరమ్మతులకు గురవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ, సిటీ పోలీస్ కమిషనర్ల బదిలీ?

... 5వ పేజీ తరువాయి

పెద్దలను కోరుతున్నారని, అందువల్లే ఆయన్ను బదిలీ జాబితాలో చేర్చినట్టు సమాచారం. మరోవైపు నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ కూడా బదిలీపై వెళ్లిపోతారనే ప్రచారం పోలీస్ శాఖలో సాగుతోంది. గత ఏడాది సెప్టెంబరు 14న సీపీగా బాధ్యతలు చేపట్టిన రవిశంకర్ అయ్యన్నార్ అదనపు డీజీపీ స్థాయి అధికారి కాగా నగర పోలీస్ కమిషనర్ పోస్టు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) స్థాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను బదిలీ చేసి ఐజీ స్థాయి అధికారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతల కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా అనుమతులు మంజూరుచేసి, కూటమి నేతల సభలు, కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడానికి ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలు సీపీపై ఉన్నాయి. పోలింగ్ తర్వాత కంచరపాలెం బర్మా కాలనీలో టీడీపీకి ఓటేశారనే కారణంతో ఒక కుటుంబంపై కొంత మంది దాడి చేస్తే, ఆ ఘటనకు రాజకీయాలకు సంబంధం లేదని సీపీ తేల్చిపారేశారని, పైగా దీనిపై ప్రెస్‌మీట్ పెట్టి ఆ గొడవకు వ్యక్తిగత కక్షలే కారణమని సీపీ చెప్పడమే కాకుండా, డీసీపీ-2తో కూడా చెప్పించారని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రభుత్వం బదిలీ చేస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం లేదా శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉందని జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు.

ఫిల్మ్ క్లబ్బు... వైసీపీ గబ్బు

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఇస్తున్నారు. క్లబ్‌కు శాశ్వత భవనాల కోసం 2019లో తెలుగుదేశం ప్రభుత్వం రామానాయుడు స్టూడియో వద్ద ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దానిని బదలాయించుకునేలోపు ప్రభుత్వం మారిపోయింది. ఆ భూమి వచ్చేలా చేస్తామని విజయ సాయిరెడ్డి బృందం క్లబ్‌ను లాగేసుకుంది. ఐదేళ్లలో ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు. క్లబ్‌కు సభ్యత్వ రుసుముల కింద కోట్ల రూపాయల ధనం సమకూరడంతో దానిని పక్కదారి పట్టించడానికి కాయల వెంకటరెడ్డి అండ్ కో భీమిలి వద్ద వివాదాస్పద స్థలాన్ని రూ.20 కోట్లతో కొనే ప్రయత్నం చేశారు. సభ్యులు కొందరు ప్రశ్నించడంతో ఆ ప్రయత్నం ఆగింది. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి రావడంతో, నాడు రామానాయుడు స్టూడియో వద్ద ఇచ్చిన ఐదు ఎకరాల జీవో ఇంకా మనుగడలోనే ఉన్నదని, దానిని సాకారం చేస్తామని, డబ్బులు కొంత ఖర్చు అవుతాయంటూ కొత్త పల్లవి అందుకున్నారు. దీనిపై రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే అడ్డగోలుగా వచ్చి శాశ్వత కమిటీగా ఏర్పడిన వారంతా తక్షణమే క్లబ్ నుంచి బయటకు వెళ్లాలని అత్యధికులు డిమాండ్ చేస్తున్నారు. క్లబ్ ఉన్న భీమిలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఇటీవల ఓ సమావేశం నిర్వహించి, మర్యాదగా తప్పుకోవాలని సూచించారు. వారంతా బయటకు వెళ్లకపోతే న్యాయబద్ధంగా పంపిస్తామని సభ్యులు చెబుతున్నారు. అద్దె స్థలంలో ఉంటూ రూ.1.5 కోట్లతో చిన్న చిన్న పనులు చేసి నిధులు దుర్వినియోగం చేశారని, అక్కడి లాన్స్‌కి కూడా 'వైఎస్ఆర్ లాన్స్' అని పేరు పెట్టారని, దీనిని పూర్తిగా ఫిల్మ్ క్లబ్‌లా కాకుండా వైఎస్ఆర్ పార్టీ క్లబ్‌లా మార్చేశారని అంతా ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.

పీజీ సెట్‌లో సత్తా చాటారు

... 5వ పేజీ తరువాయి

సిరిపురపు సాయి ప్రణీత రెండో ర్యాంకు, ఎలక్ట్రానిక్స్‌లో సీతంపేటకి చెందిన తుట్టా తారక్‌స్వరూప్ పదో ర్యాంకు, ఇంగ్లీష్‌లో రేసపువానిపాలెంకి చెందిన గుజ్జు సిద్ధ గాయత్రి 11వ ర్యాంకు, కైలాసపురానికి చెందిన పీతల జూహిత 11వ ర్యాంకు, ఫుడ్, న్యూట్రిషియన్ అండ్ డైటిక్స్‌లో పంజాబీ హోటల్ సమీపాన సాయినగర్‌కు చెందిన పూజారి హారిక మూడో ర్యాంకు, పెందుర్తికి చెందిన రెడ్డి జ్యోతిర్మయి నాలుగో ర్యాంకు, మహారాణిపేటకు చెందిన అదపాక నిషిత 12వ ర్యాంకు సాధించారు. జియాలజీలో పెందుర్తికి చెందిన కిల్లో చాందిని రెండో ర్యాంకు, హిందీలో సీతమ్మధారకి చెందిన ఫరూఖున్నీషా ఆరో ర్యాంకు, లైఫ్ సైన్సెస్‌లో గాజువాకకి చెందిన బోర వసంత్ ఆరో ర్యాంకు, మ్యాథమెటికల్ సైన్స్‌లో గాజువాకకి చెందిన వాకాడ చంద్రిక తొమ్మిదో ర్యాంకు, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో సిరిపురం వాసి చీరకాపు సాయి శ్రావణి ఎనిమిదో ర్యాంకు, పొలిటికల్ సైన్స్‌లో పెందుర్తికి చెందిన బి.అనన్య సాహితీ ఏడో ర్యాంకు, గాజువాకకు చెందిన గుంప దుర్గ పదో ర్యాంకు, జువాలజీలో సాగర్‌నగర్‌కి చెందిన పప్పల మానససాయి లక్ష్మి రెండు, పెందుర్తికి చెందిన బొడ్డేడ మౌనిక ఏడు, అల్లిపురానికి చెందిన కొల్లి వెంకటసాయి ఆకాష్‌రెడ్డి తొమ్మిదో ర్యాంకు సాధించారు. సైకాలజీలో దువ్వాడకి చెందిన నందినీ సంతోష్ ఐదో ర్యాంకు, అగనంపూడికి చెందిన గేదెల నిహారిక ఐదో ర్యాంకు సాధించారు. స్టాటిస్టిక్స్‌లో అక్కయ్యపాలెం అశ్వినీ చౌదరి నాలుగో ర్యాంకు, టూరిజంలో పద్మానాభం ప్రాంతానికి చెందిన దీర మణికంఠ మూడో ర్యాంకు సాధించి సత్తా చాటారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూన్ 27 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠంపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ సంపెంగలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

స్వామివారి సన్నిధిలో బరంపురం ఎమ్మెల్యే

వరాహలక్ష్మీనృసింహస్వామిని ఒడిశాలోని బరంపురం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా, గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, ఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జూన్ 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని పోతినమల్లయ్యపాలెం గ్రామానికి చెందిన బలిజ నాగేశ్వరరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో దేవాలయం పీఆర్‌ఓ కార్యాలయ అధికారులు అప్పలనాయుడు, వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయం దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

గాయత్రి విద్యా పరిషత్‌లో మైక్రో బయోమ్ డే

ఎంవీపీ కాలనీ, జూన్ 27 : మానవుల సంపూర్ణ ఆరోగ్యంలో మైక్రో బయోమ్ (సూక్ష్మజీవి) పాత్ర చాలా కీలకమైనది ఆచార్య డి.విజయభారతి అన్నారు. అంతర్జాతీయ మైక్రో బయోమ్ దినోత్సవం సందర్భంగా గురువారం ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫీడింగ్ యువర్ గట్ అన్న అంశంపై ఈ ఏడాది మైక్రోబయోమ్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యానికి సహకరించే సూక్ష్మజీవులు, ఆరోగ్యానికి భంగం కలిగించే సూక్ష్మజీవులకు మధ్య వ్యత్యాసాన్ని, మానవ శరీరాలపై వాటి ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బోస్, అధ్యాపకులు డి. గిరిధర్, పల్లవి, సుజాత, శ్యామల, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ఎండాడ, జూన్ 27 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు గురువారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నొడగల అప్పారావు, టీడీపీ నాయకులు చెట్టుపల్లి గోపి, చిన గోపి, సన్యాసిరావు, ఒమ్మి బాబురావు, దొరబాబు,మంగాదేవి, జనసేన నాయకులు శాఖరీ శ్రీనివాస్, వైసీపీ నాయకులు అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి పాల్గొన్నారు.

షర్మిల దృష్టికి పంచ గ్రామాల భూ వివాదం

సింహాచలం, జూన్ 27 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ వివాద అంశాన్ని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దృష్టికి తీసుకువెళ్లినట్టు అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, ఆయన సతీమణి, 98వ వార్డు మాజీ కార్పొరేటర్ పాశర్ల వసంత కల్యాణి తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆదివారం హైదరాబాద్‌లో షర్మిలను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. పంచ గ్రామాల పరిసరాల్లో స్వయంగా పర్యటించి, ప్రజల మనోభావాలను, ఇబ్బందులను తెలుసుకోవాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. త్వరలోనే ఆమె ఈ ప్రాంతంలో పర్యటిస్తారని తెలిపారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 78, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారేట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6,మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 160, బరబటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

రైతులకు అండగా ప్రభుత్వం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఖరీఫ్ విత్తనాలు పంపిణీ

భీమునిపట్నం, జూన్ 27 : పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు పుష్కలంగా సాగునీరు అందించడం ద్వారా వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ రైతులకు రాయితీపై ఖరీఫ్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులో 73 శాతం పనులను పూర్తి చేయగా వైసీపీ పాలనలో పనులు పడకేశాయని విమర్శించారు. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మిగిలిన పనులను పూర్తి చేసి పోలవరాన్ని ప్రజలకు అంకితం చేస్తామన్నారు. అసలు ఏపీ అంటేనే అమరావతి, పోలవరం అని అభివర్ణించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో పంటల సాగులో అధిక దిగుబడి సాధించాలని చెప్పారు. రైతులు సంతోషంగా వుంటేనే దేశంలో ఆనందంగా ఉంటుందన్నారు. ప్రతి ఎకరాకు రూ.20 వేలు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తాను అనకాపల్లి ఎంపీగా జిల్లాలో పూడికతీతలకు ప్రైవేటుగా ఉచిత ప్రొక్లెయినర్లు ఇవ్వడంతో రైతులకు అప్పట్లో ఎంతో మేలు జరిగిందని, అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి దేవేందర్ గౌడ్‌పై జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలు వత్తిడి తీసుకురావడంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా నీరు-మీరు కార్యక్రమాన్ని డిజైన్ చేసి రైతులకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ లో ప్‌లో వరి సాగు విస్తీర్ణం 9,500 ఎకరాలు కాగా, విత్తనాలు 2,850 క్వింటాళ్లకు 2,200 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం ఆయన రైతు భరోసా మాస పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, చిక్కాల విజయ్‌బాబు, భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, మండల టీడీపీ అధ్యక్షుడు రాజు, భీమిలి బీజేపీ ఇన్‌ఛార్జి రామానాయుడు, జనసేన నాయకులు కిరణ్, భీమిలి ఆర్డీవో ఎస్. భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ గోవింద్, ఎంపీడీవో జానకి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ఏవోలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి తండ్రికి పరామర్శ

కె. నగపాలెంలో టీడీపీ నాయకుడు తొత్తడి సూర్య తండ్రి కృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, పోతిన అప్పలరాజు, శీరపు రమణ, తొత్తడి సూర్య మరుపిళ్ల రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో పార్కుల ఏర్పాటు

తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

విశాలాక్షినగర్, జూన్ 27 : ఆహ్లాదకర వాతావరణంలో తీరానికి అభి ముఖంగా పార్కు అందుబాటులోకి వస్తే విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం ఆయన 9వ వార్డు బీచ్ రోడ్డు నుంచి విశాలాక్షి నగర్ మలుపులో రూ.1.8 కోట్లతో ఏర్పాటు చేయనున్న పార్కు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో వాకింగ్ చేయడానికి ట్రాక్, యోగా చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లతో పాటు ఓపెన్ జిమ్, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. పార్కును సీనియర్ సిటిజన్లు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పుణ్యతిధిలో భాగంగా ఎమ్మెల్యే తన మాతృమూర్తి సీతమ్మ పేరుతో ఆ ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్సు ఈఈ శాంతిరాజు, డీఈ వంశీ, ఏఈ శ్రీధర్, టీడీపీ నాయకులు అక్కరబోయిన రాంబాబు, బుడుమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు, గరికిన నూకరాజు, వెంకన్న, శ్రీనివాసరెడ్డి, భూలక్ష్మి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, విశాలాక్షినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, జోడుగుళ్లపాలెం గ్రామ కమిటీ సభ్యుడు ఉమ్మడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెన్షనర్లకు, ఉద్యోగులకు వారధిగా ఉండండి

ఎంవీపీ కాలనీ : పింఛనుదారులకు, ఉద్యోగులకు వారధిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సేవలందించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కోరారు. గురువారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని సచివాలయాల అడ్మిన్‌లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే మూడు నెలల బకాయితో పాటు జూలై నెల పింఛను రూ. 4 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులకు సత్వరమే పింఛను అందేలా సచివాలయాల సిబ్బంది ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వారికి ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఒమ్మి సన్యాసిరావు, చోడె పట్టాభిరాం, నాయకులు బొట్ట వెంకటరమణ, ఒమ్మి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జూన్ 27 : మధురవాడ శ్రీరామ్ ప్రోపర్టీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెంకటేశ్వరస్వామి మెట్ట, ఖుషి షాపింగ్ మాల్ ప్రాంతం, పాత మధురవాడ మెట్ట, మిథిలాపురి వుడా కాలనీ, వుడాకాలనీ ప్రధాన రహదారి ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

మద్దిలపాలెం పరిధిలో...

మద్దిలపాలెం : మద్దిలపాలెం ఫీడర్ 11 కేవీ, శివాలయం ఫీడర్ 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు. మద్దిలపాలెం, భానునగర్, కృష్ణ కళాశాల ఏరియా, శివాలయం ఏరియా, పెద్దనుయ్యి, ఎర్రాజీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, ఎంవీపీ అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

తాళ్లవలస పరిధిలో....

భీమునిపట్నం (రూరల్) : భీమిలి రూరల్ మండలం తాళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. తాళ్లవలస, వలందపేట, ఎరుసుపేట, ఓనుముపేట, రాయనపేట, తాళ్లవలస రాజులవీధి ప్రాంతాలతో పాటు ఆ పరిధిలో ఉన్న అన్ని లేఅవుట్లకు సరఫరా ఉండదని చెప్పారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా జానకి

పద్మనాభం, జూన్ 27 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు వి. ఉమాజానకి పిలుపునిచ్చారు. గురువారం ఆమె పద్మనాభంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నామని, వాటి నుంచి కాపాడుకోవడానికి ప్రతి గ్రామంలోనూ మొక్కలు పెంచే విధంగా ప్రజలను చైతన్యపరచాలన్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సహాయం

ఆరిలోవ, జూన్ 27 : ఆరిలోవ 3వ సెక్టార్ రాజీవ్ నగర్‌లో ఉంటున్న కిడ్నీ రోగి షేక్ వల్లీలకు కాలనీవాసులంతా కలిసి గురువారం రూ. 26, 200 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో రాజీవ్ నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి గోపల్లి రామకృష్ణ, రమ, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో వెలగని లైట్లు

భీమునిపట్నం, జూన్ 27 : పట్టణంలోని చిన్నబజారు సమీపంలో ఉన్న జీవీఎంసీ మినీ స్టేడియంలో ఫ్లెడ్ లైట్లు వెలగకపోవడంతో క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా స్టేడియంలో ప్రహరీని ఆనుకుని ఉన్న సుమారు 20 ఫ్లెడ్ లైట్లు వెలగక ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. దీంతో సాయంత్రం వేళలో షటిల్,వాలీబాల్ తదితర క్రీడాకారులు, వాకర్స్ చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అంధకారంలో ఉన్న స్టేడియం

పలకలు వేసిన ఆరు నెలలకే పగుళ్లు

ఆరిలోవ, జూన్ 27 : గ్రేటర్ పరిధిలోని 12వ వార్డులో సుమారు రూ. 4 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టిన యూజీడీ పనుల్లో నాణ్యతా లోపాలు ఆరునెలలకే బయట పడుతున్నాయి. ఈ పనులను దీనదయాళపురం నుంచి పెదగదిలి జంక్షన్ వరకు చేశారు.కొన్నిచోట్ల పైపులైన్ పనులకు వేసిన సిమెంటు పలకలు కొద్ది రోజులకే పగిలిపోతున్నాయి. దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టరు చేపట్టిన పనుల్లో నాణ్యత లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పగుళ్లు తేరిన పలక

మందుల షాపులో చోరీ

తగరపువలస, జూన్ 27 : తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న మందుల షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు దుకాణంలోని రూ. 40 వేల నగదు అపహరించారు. పైకప్పు సిమ్మెంటు రేకులతో ఉండడంతో వాటిని తొలగించి, లోపలకు దిగి చోరీ చేశారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి రాని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

ఆనందపురం, జూన్ 27 : మండలంలో మారుమూల గ్రామాల్లో నిర్మిస్తున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం, మామిడిలోవ పంచాయతీ దబ్బంద, రామవరం, కణమాం గ్రామాలు కొండల మధ్య ఉండడంతో అక్కడ వారికి సెల్ సిగ్నల్స్ అందడం లేదు. అన్ని ప్రభుత్వ పథకాలకు మొబైల్, ఆధార్ నంబర్లను అనుసంధానం చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు సెల్ నెట్‌వర్క్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో టవర్ల నిర్మాణానికి బీఎస్ఎన్ఎల్ సంస్థ ముందుకు వచ్చింది. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం

- ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక
- ఆనందపురం మండల సమావేశం

ఆనందపురం, జూన్ 27 : మండలాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేసే దిశగా అందరూ సహకరించాలని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలను విడనాడి ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధికి కలిసి పని చేస్తామన్నారు. పథకాల అమలులో పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని, అందుకు స్థానిక నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అమలుకు కూటమి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సహకరిస్తామన్నారు. తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరగా దీనికి సభ్యులంతా ఏకీభవించడంతో తీర్మానం చేశారు. అనంతరం జడ్పీటీసీ వెంకటరావు మాట్లాడుతూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించినప్పటికీ గత ప్రభుత్వంలో భవనాలు నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వసతి లేమిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆ స్థలానికి సరైన హద్దులు నిర్ణయించి, ప్రహరీ ఏర్పాటు చేసి భవనాలు నిర్మించేలా చూడాలని కోరారు. అలాగే మండలంలో ఒక అంగన్వాడీ, నాలుగు హెల్పర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెల్లంకి పంచాయతీలో ఉపాధి పనుల ద్వారా కాలువల మరమ్మతు చేపట్టి చెరువుల్లోకి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని వెల్లంకి ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు చెప్పారు. వెలుగు ఏపీవో నాగభూషణం మాట్లాడుతూ స్వయం సంఘాల గ్రూపు సభ్యులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లయితే పది లక్షల రూపాయల వరకు 35 శాతం రాయితీపై రుణాలు అందిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు జీరో వడ్డీకి లక్ష రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉందని వివరించారు.బోని ఎంపీటీసీ సభ్యుడు బోని అప్పలనాయుడు మాట్లాడుతూ ఇనాం భూములపై కొంత అనధికారికంగా సమావేశాలు నిర్వహించి, శిస్తులు కట్టమని చెప్పడంపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వపరంగా ఎటువంటి లావాదేవీలకైనా రైతులు సిద్ధంగా ఉన్నారని, సంబంధం లేని వ్యక్తులు సమావేశాలు నిర్వహించి శిస్తు కట్టమంటే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్షించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో అప్పలనాయుడు, డిటి రాజేష్, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు



వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న అర్చకులు

'బ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి'

మద్దిలపాలెం, జూన్ 27 : రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని బాల భాను అర్చక, పురోహిత సంఘం నాయకులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు.గురువారం వారు శివాజీపాలెంలో ఎమ్మె ల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పురోహితులు, అర్చకులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు సమకూర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు, మురుపాక కృష్ణమూర్తిశర్మ, కార్యదర్శి కిశోర్‌కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ కియా షోరూమ్‌లో ఫ్రీ సర్వీస్ క్యాంపు

కొమ్మాది, జూన్ 24 : దేశంలోనే దిబెస్ట్ బ్రాండ్‌గా కియో మోటర్స్ నిలిచిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. సోమవారం ఆయన మధురవాడలో లక్ష్మీ కియా షోరూమ్‌లో ఫ్రీ సర్వీస్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 3వ తేదీ వరకూ ఫ్రీ సర్వీస్ క్యాంపు కొనసాగుతుందన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కియా పరిశ్రమను రాష్ట్రానికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ఆ సంస్థ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొందని, ఈ పరిస్థితుల్లో విడి భాగాల తయారీ యూనిట్ తమిళనాడు రాష్ట్రానికి తరలిపోయిందన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో కియా విడి భాగాల యూనిట్ తిరిగి రాష్ట్రానికి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ కియా జనరల్ మేనేజర్ నారాయణరాజు, సర్వీస్ మేనేజర్ కె. వరప్రసాదు, బాడీ షాప్ మేనేజర్ కె. వంశీ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీవీ రామ్

గ్రామాల్లో రీ సర్వే రద్దు చేయాలని వినతి

పద్మనాభం (రూరల్), జూన్ 27 : మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చేసిన భూ రీసర్వేను తక్షణమే రద్దు చేయాలని ఎంపీపీ కాళ్ల పద్మ. నగేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేపట్టిన రీసర్వే వల్ల కొందరు రైతుల భూములు గల్లంతయ్యాయని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రుణాల కోసం వెళ్తున్న వారికి ఆన్‌లైన్‌లో వారి భూముల వివరాలు కనిపించడం లేదన్నారు. రీ సర్వేలో అక్రమాల దృష్ట్యా రద్దు చేసి, అసలైన రైతుల భూములను తిరిగి చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జీవీఎంసీ పాఠశాలలు తనిఖీ

భీమునిపట్నం (రూరల్), జూన్ 27 : భీమిలి జోన్ పరిధిలోని జీవీఎంసీ పాఠశాలలను డైట్ లెక్చరర్ ఎస్. త్రినాథరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో అమలవుతున్న విద్యా ప్రవేశిక, నేను బడికి పోతా కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టిక, డైరీ, టీచింగ్ నోట్స్‌లు పరిశీలించారు.

స్టాటిస్టిక్స్ విభాగానికి పుస్తకాలు వితరణ



పుస్తకాలు అందిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, జూన్ 27 : ఏయూలోని స్టాటిస్టిక్స్ విభాగానికి విశ్రాంత ఆచార్యులు, ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాసరావు గురువారం 1300 పైగా పుస్తకాలు, జర్నల్స్, ఆల్బమ్స్ బహూకరించారు. 40 ఏళ్లుగా తాను పరిశోధనకు ఉపయోగించిన వివిధ పుస్తకాలు, పరిశోధనా పత్రాలతో కూడిన జర్నల్స్, వివిధ సదస్సులకు సంబంధించిన ఆల్బమ్స్ ఇచ్చారు. వీటిని విభాగ విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉంచాలని ఆ విభాగం హెడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య బి. మునిస్వామి పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు సత్కారం



బదిలీ అయిన పోస్టల్ ఉద్యోగులతో సిబ్బంది

భీమునిపట్నం, జూన్ 27 : భీమిలి సబ్ పోస్టాఫీసులో నాలుగేళ్లుగా సేవలందించి బదిలీ అయిన సబ్ పోస్టు మాస్టర్ ఎన్. ఆదినారాయణను సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. అలాగే పోస్టల్ అసిస్టెంట్లు బి.ఆదినారాయణ, శంకరావును, బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆర్. స్వాతిని సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వారు చేసిన సేవలను కొనియాడారు.

సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస, జూన్ 27 : నగరంలోని మాధవదారలో జూలై 1, 2, 3 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు జరగనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. గురువారం వారు జీఆర్ భవన్‌లో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు మాట్లాడుతూ సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో చిల్ల రాంపైడి, మోర అప్పలరాజు, మామిడి సన్నిబాబు పల్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు

తగరపువలస, జూన్ 27 : బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తగరపువలస ప్రభుత్వ వైద్య సిబ్బంది గురువారం పలు ఆరోగ్య సూచనలు అందించారు. విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసు కోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు.అనంతరం రక్త హీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, ఆశావర్కర్ స్వాతి పాల్గొన్నారు.